పేట్రేగుతున్న మట్టి మాఫియా!

- చెరువుల్లో భారీగా మట్టి తవ్వకాలు
- రోజుకి వెయ్యి లోడ్ల మట్టి అక్రమ రవాణా
- లేఔట్లకు అమ్ముకుంటున్న మట్టి వ్యాపారులు
- కూటమి నేతలకు కమీషన్లు
- కనుమరుగవుతున్న పెద్ద చెరువులు


బైరెడ్డిపల్లి పెద్దచెరువులో యథేచ్ఛగా మట్టి, ఇసుక తవ్వకాలు

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పచ్చ నేతలు ఎన్ని అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించాలో అన్ని మార్గాలను చేసుకుంటూ వెళుతున్నారు. గతంలో కూడా ఇలాంటి అక్రమాలు కొంతవరకు సాగినా ఇంత దారుణంగా ఎన్నడూ లేదని జనం అనుకుంటున్నారు. చెరువుల్లోని బంక మట్టిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. దీంతో పలమనేరు నియోజకవర్గంలోని పెద్ద చెరువులు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. కొన్ని చెరువుల్లో పదుల సంఖ్యలో జేసీబీ యంత్రాలు, అంతకుమించి ట్రాక్టర్లు రాత్రి పగలూ అనే తేడా లేకుండా తవ్వకాలను చేస్తున్నారు. గతంలో రాజులు చెరువులను తవ్వించి గ్రామాభివృద్ధికి పాటుపడితే నేటి కూటమి పాలకులు ఉన్న చెరువులను సర్వనాశనం చేసి సొమ్ము చేసుకుంటున్నారనే మాట గట్టిగా వినిపిస్తోంది.

బైరెడ్డిపల్లి చెరువును తోడేస్తున్నారు..

నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని చెరువులో నిత్యం జేసీబీలు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మట్టిని తోడేస్తున్నాయి. ఈ తతంగం అంతా అక్కడి ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ముందే సాగుతున్నా దీనిపై అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. అసలు మైనర్ ఇరిగేషన్ అధికారులు, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు అసలు పట్టించుకోవడం లేదు. ఈ చెరువు మార్గంలో నిమిషానికి పది ట్రాక్టర్లు వెళుతున్నాయంటే రోజుకి ఎన్ని వేల ట్రాక్టర్ల మట్టి చెరువు నుంచి పోతుందో లెక్కకట్టుకోవచ్చు. చెరువును ఇలా సర్వనాశనం చేస్తున్న వైనాలు తాము పుట్టినప్పటి నుంచి చూడలేదని ఈ ఘోరాలను చూసి ఏం చేయలేక సాధారణ జనం మదనపడుతున్నారు. కనీసం జిల్లా అధికారులైనా ఓసారి బైరెడ్డిపల్లి పెద్ద చెరువును చూస్తే చాలనే మాట జనం నుంచి సర్వత్రా వినిపిస్తోంది. ఈ పరిస్థితి నియోజకవర్గంలోని వందల చెరువుల్లో నిత్యం సాగు తూనే ఉంది. కూటమి నేతల అండతోనే అక్రమార్కులు మట్టి దందాను సాగిస్తున్నారనేది పచ్చినిజం.

ఏ చెరువులో చూసినా జేసీబీ, ట్రాక్టర్లే..

పలమనేరు నియోజకవర్గంలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు 110 దాకా ఉన్నాయి. చిన్నపాటి చెరువులు, కుంటలు 500 దాకా ఉన్నాయి. ఓ వైపు ఇసుకాసురులు, మరోవైపు మట్టి మాఫియా చెరువులను సర్వనాశనం చేస్తున్నారు. ఈ మండలం, ఆ మండలమని కాదు నియోజకవర్గంలో ఏ చెరువులో చూసినా పచ్చతమ్ముళ్ల అండతో మట్టి వ్యాపారాలు జోరందుకున్నాయి.

తాగునీటికి ప్రత్యేక చర్యలు


మోటారును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ గ్రామాల్లో నూతన బోరు బావులను ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కనుమనాయనపల్లిలో కొన్ని రోజుల క్రితం మండల పరిషత్ నిధులతో నూతన బోరును ఏర్పాటు చేశారు. శనివారం ఈ బోరుకు జెడ్పీ నిధుల ద్వారా బోరు మోటారును ఏర్పాటు చేశారు. ఈ మోటారును జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. బోరులో నీరు పుష్కలంగా రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ అనిత, ఎంపీటీసీ కమల్, వార్డు మెంబర్లు మణి, కిషోర్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, కృష్ణప్ప పాల్గొన్నారు.

రాజనాలబండకు చేరిన పొట్టేళ్ల చోరీ వ్యవహారం

- సత్యప్రమాణాల కోసం వచ్చిన గ్రామస్తులు
- వచ్చే వారానికి వాయిదా


చౌడేపల్లె రాజనాల బండపై చేరిన తోటకురప్పల్లెకు చెందిన గ్రామస్తులు

చౌడేపల్లె : మండలంలోని శెట్టిపేట పంచాయతీ తోటకురప్పల్లెలో ఇటీవల జరిగిన పొట్టేళ్ల చోరీ వ్యవహారం శనివారం సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాల బండకు చేరింది. తోటకురప్పల్లెకు చెందిన చెంగారెడ్డి గొర్రెలు, పొట్టేళ్లు మేపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి వద్ద ఉన్న గొర్రెల మందలోని 20 పొట్టేళ్లను గత నెల 28వ తేదీ తెల్లవారుజామున బొలెరోలో తరలిస్తూ సీసీ పుటేజీలను గుర్తించారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. ఇదిలా ఉండగా గ్రామంలోని పెద్దల సమక్షంలో ఇంటికొకరుతో కలిసి పంచాయతీ నిర్వహించి విచారణ చేపట్టారు. దొంగల సమాచారం చెప్పకపోవడంతో పాటు గ్రామస్తుల అండ లేనిదే రాత్రిపూట పొట్టేళ్ల అపహరణ సాధ్యం కాదని పంచాయతీలో బాధితుడు నిలదీశారు. పెద్దమనుషులు ఆదేశాల మేరకు గ్రామస్తులందరూ రాజనాల బండకు చేరుకొని దొంగతనం గురించి తెలియదని, తాము చేయలేదంటూ సత్య ప్రమాణాలు చేయాలని తీర్మానించారు. ఈ మేరకు గ్రామస్తులందరూ రాజనాలబండ వద్దకు చేరుకొన్నారు. అర్చకుడు కృష్ణమూర్తి గ్రామస్తులను సమావేశ పరిచి విచారణ చేపట్టారు. తప్పు చేసిన వారు నేరం ఒప్పుకోవాలని లేకుంటే తప్పు చేసి ప్రమాణం చేస్తే జరిగే పరిణామాలను వివరించారు. గ్రామస్తులకు వారం గడువునిస్తూ వచ్చే శనివారం తిరిగి ప్రమాణానికి అందరూ రావాలని తీర్మానించారు. కాగా చోరీ ఘటన ఉత్కంఠకు ఎప్పుడు తెరపడుతుందా అని వేచి చూడడం గమనార్హం.

ముగిసిన శిక్షణ తరగతులు


చౌడేపల్లెలో సులభతరంగా విద్యాబోధనపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన

చౌడేపల్లె: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో మూడు రోజులుగా పోషణ్ బీ పడాయ్‌బీ కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల్లో బోధన సామర్థ్యంపై శిక్షణతోపాటు పిల్లలకు అందించాల్సిన పోషణ, ఆటలు, విద్యాబోధన, వ్యాధుల నుంచి బిడ్డల సంరక్షణకు తల్లితండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఎదుగుదల లేని పిల్లల పట్ల తీసుకోవాల్సిన మెళకువలు, తినాల్సిన పోషణ పదార్థాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో నేర్చుకొన్న అంశాలను గ్రామాల్లోని పిల్లల తల్లిదండ్రులకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సంఘ ప్రతినిధులు

పుంగనూరు: విద్యారంగంలోని సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ.రమణ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. రమణ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య 60మందికి పైగా ఉంటే ఆ పాఠశాలను ప్రైమరీ మోడల్ స్కూల్‌గా ప్రకటించాలన్నారు. ప్రతి హైస్కూల్‌లోనూ గెజిటెడ్ హెడ్‌మాస్టర్లను, పీఈటీలను నియమించాలన్నారు. 12వ పీఆర్‌సీని అమలు చేయాలని, పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై చర్చించేందుకు ఏప్రిల్ 5న తిరుపతిలో ఉపాధ్యాయుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వీటిపై వెంటనే స్పందించాలని కోరారు. మణికంఠన్, ఈశ్వర్, మహేంద్ర, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు, రెడ్డెప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కృష్ణమరాజు, శంకర్‌రెడ్డి, ఈగ సహదేవ, లోకనాథరెడ్డి, హరి, కరుణాకర్, పోతయ్య, శంకర్, జగన్నాథరాజు, నాగేంద్రరాజు, ఈశ్వరయ్య, రామచంద్ర, సుబ్రమణ్యంరెడ్డి, వెంకటేష్, బాలాజి, రమేష్, పీతాంబరం పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


గంగినాయనపల్లె పాఠశాలను తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ

బైరెడ్డిపల్లె: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు ఆదేశించారు. మండలంలోని గంగినాయనపల్లె సచివాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే అధికారులపై నమ్మకం కలుగుతుందన్నారు. అలాగే గంగినాయనపల్లె, కొత్తయిండ్లు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మన సంప్రదాయాలను గౌరవిద్దాం



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ నాగరాజు

కుప్పంరూరల్: మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు అన్నారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన 'ఎథిక్స్ డే' (సంస్కృతి, సంప్రదాయ దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచంలో అన్ని సంప్రదాయాల కన్నా మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవన్నారు. ఉన్నత విలువలు కలిసిన సంప్రదాయాలను మనం పాటించడమే కాకుండా మన భావితరాలకు కూడా అందించాలని కోరారు. వైస్ చైర్మన్ డా.సునీల్‌రాజ్ మాట్లాడుతూ మన పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాల గురించి నేర్పితే వారు గొప్పవారుగా తయారవుతారని సూచించారు. అనంతరం విద్యార్థులకు ముగ్గులు, ఖోఖో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ సాగర్‌రాజ్, వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ఆరోగ్యకర సమాజమే లక్ష్యం


శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు

కుప్పంరూరల్: ఆరోగ్యకర సమాజ నిర్మాణమే 'పోషణ్ బీ- పడాయి బీ' లక్ష్యమని కుప్పం ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం ముగింపు సందర్భంగా సీడీపీఓ పలు అంశాలపై వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న పోషణ్ బీ-పడాయి బీ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అంగన్‌వాడీలో అందించే గుడ్లు, పాలు, అటుకులు, బెల్లం, ఎండు కర్జూరా, రాగిపిండి ఇవ్వడం జరుగుతోందన్నారు. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా పిల్లలు, గర్భిణులు ఆరోగ్యవంతులుగా తయారవుతారన్నారు. కార్యక్రమంలో శిక్షకులు కృష్ణవేణి, లక్ష్మీదేవి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

క్షయను పూర్తిగా నయం చేయవచ్చు


కాకాతోపు ఆస్పత్రిలో అవగాహన ర్యాలీ


పట్టణంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పలమనేరు: క్షయ వ్యాధి సోకిన వారికి ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన చికిత్స అందుబాటులో ఉందని, దీన్ని పూర్తిగా నయం చేసుకోవచ్చునని స్థానిక సబ్ యూనిట్ అధికారి జయశంకర్ తెలిపారు. జాతీయ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని శనివారం స్థానిక కాకాతోపు అర్బన్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీని చేపట్టి ఇందుకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. లెప్రసీ నివారణ అధికారి దయానంద్, సూపర్‌వైజర్ జగదీశ్వరి, సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టీబీని తరిమికొడదాం

వి.కోట: టీబీ వ్యాధిని ముందుగా గుర్తించి, జాగ్రత్తలు తీసుకుంటే పూర్తిగా నయం చేసుకోవచ్చని సీహెచ్‌సీ వైద్యాధికారి మురళి అన్నారు. ఈనెల 24 ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో వైద్యబృందం, క్షయ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది ఆస్పత్రి వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పట్టణంలో విద్యార్థినులతో ర్యాలీ చేసి క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. సీహెచ్‌సీ వైద్యాధికారులు మురళీ, కిరణ్, కల్పన, జ్ఞానేంద్ర, ప్రమీల, హరిప్రసాద్, యువరాజ్, పెంచులయ్య లీలావతి, సుబ్రమణ్యం, నర్సులు పాల్గొన్నారు.

నూతన వీఆర్వోల కార్యవర్గం ఎంపిక


ఎంపికైన వీఆర్వోల కార్యవర్గ సభ్యులు

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్ నూతన వీఆర్వోల కార్యవర్గం ఎంపిక స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏపీజీఈఏ అసోసియేట్ అధ్యక్షుడు బాలాజీ రెడ్డి, వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా జరిగింది. డివిజన్ అధ్యక్షుడిగా సుబ్రమణ్యం ఆచారి, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, అక్బర్‌అలీ, ప్రధాన కార్యదర్శిగా వినయ్‌కుమార్, సహాధ్యక్షుడిగా వెంకటరావు, సంయుక్త కార్యదర్శిగా లోకనాథం, సభ్యులుగా రాజేంద్ర, గంగులమ్మ, వెంకటరత్నం, జయరామ్ ఉన్నారు. నేతలు హనుమంతరావు, దామోదరం పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

శాంతిపురం: మండలంలోని 64 పెద్దూరు పంచాయతీలోని సోమాపురంలో సరిపడా తాగునీరు అందడం లేదని గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు రావడంతో అధికారులు శనివారం గ్రామాన్ని సందర్శించారు. రక్షిత మంచినీటి పథకానికి ఉన్న బోరులో నీటిమట్టం తగ్గినట్టు స్థానిక సర్పంచ్ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఆదర్శ్ వివరించారు. ప్రత్యామ్నాయ చర్యలను పరిశీలించిన ఎంపీడీఓ గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలోని బోరు నీటిని గ్రామ అవసరాలకు వినియోగించుకునేలా ఆదేశాలు ఇచ్చారు. సర్పంచ్, కార్యదర్శిని సమన్వయం చేసుకుని దీనికి అవసరమైన పైపులైన్ల ఏర్పాటు పనులను వెంటనే చేపట్టాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరికృష్ణకు బాధ్యతలు అప్పగించారు.

ముగిసిన సదరం క్యాంపు


శిబిరంలో పాల్గొన్న దివ్యాంగులు

కుప్పం: రెండు రోజుల పాటు కుప్పం వంద పడకల ఆస్పత్రిలో నిర్వహించిన సదరం క్యాంపు శనివారంతో ముగిసింది. కుప్పం మున్సిపాలిటీ, కుప్పం రూరల్ పరిధిలో ఉన్న 2,504 మంది దివ్యాంగులు సదరం క్యాంపునకు హాజరై తమ అంగవైకల్యాన్ని పరీక్షించుకున్నారు. వైద్యులు హాజరైన వారిని పరిశీలించి సదరం సర్టిఫికెట్ల మంజూరుకు సిఫారసు చేశారు. రెండు రోజుల పాటు 5,175 మంది దివ్యాంగులు సదరం క్యాంపులో పాల్గొని సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వికలాంగత్వ శాతాన్ని బట్టి పెన్షన్ మంజూరు కొనసాగింపు ఉంటుంది. దీంతో రెండు రోజుల సదరం క్యాంపు విజయవంతంగా ముగిసింది.

మూడు రోజుల్లో పన్నులు చెల్లించండి


మధుసూదన్‌రెడ్డి
కమిషనర్

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి, నీటి పన్ను మూడు రోజుల్లోపు చెల్లించాలని లేకుంటే ఇంటికి కరెంటు కట్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి బకాయిదారులకు హెచ్చరికలు జారీ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పన్నులు చెల్లించాలని, యజమానులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ విషయమై చివరి గడువు ఇస్తున్నామన్నారు. యజమానులు స్పందించకుంటే కరెంట్ కట్ చేసి మున్సిపల్ సేవలు బంద్ చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

నీటిని దుర్వినియోగం చేయొద్దు


మాట్లాడుతున్న ఎన్జీఓలు

రొంపిచెర్ల: నీటిని దుర్వినియోగం చేయొద్దని రొంపిచెర్ల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సరళ విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ నీటి దినోత్సవం సందర్భంగా శనివారం విద్యార్థులకు ఎన్జీఓలతో కలిసి నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ నీటిని దుర్వినియోగం చేస్తే నీటి కొరత తప్పదన్నారు. అప్పుడు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు తిమ్మయ్య, సుధాకర్‌రెడ్డి, గుర్రప్ప నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్సతో టీబీ నయం


అవగాహన ర్యాలీలో సిబ్బంది

సదుం: టీబీ వ్యాధికి తగిన చికిత్స, సూచించిన పౌష్టికాహారం తీసుకుంటే నయం చేయవచ్చునని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పుష్పకుమారి తెలిపారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకుని శనివారం అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. వ్యాధి గ్రస్తులకు ఉచితంగా చికిత్స అందించడంతో పాటు పౌష్టికాహారం కోసం నెలకు వారి ఖాతాలో వెయ్యి రూపాయలు జమ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. వైద్యులు భార్గవి, సోమశేఖర్ రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ లక్ష్మీపతి, సిబ్బంది జహీరా బేగం, బాలాజీ పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

–పలమనేరు రూరల్ సీఐ మురళీమోహన్



పెద్దపంజాణి: ఆన్‌లైన్ బెట్టింగు యాప్‌లతో జీవితాలను నాశనం చేసుకోవద్దని పలమనేరు రూరల్ సీఐ మురళీమోహన్ తెలిపారు. శనివారం నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యంగా యువత ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. చిన్న మొత్తాలతో ప్రారంభించిన బెట్టింగులు ఆసక్తి పెరిగే కొద్ది పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోతారన్నారు. చివరకు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యా ప్రయత్నాలకు దారితీస్తాయన్నారు. ఈ తరహా కేసుల్లో నిందితులపై జైలుశిక్షతోపాటు జరిమానాలు తప్పవన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగులకు పాల్పడేవారి సమాచారాన్ని డయల్ 112, 100 లేదా 9491074521కి అందించాలని సీఐ కోరారు.

చట్టబద్ధంగా దత్తత తీసుకోండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

శాంతిపురం: పిల్లలను దత్తత తీసుకునే తల్లిదండ్రులు చట్టబద్ధంగా మాత్రమే తీసుకోవాలని ఎంపీడీఓ కుమార్ కోరారు. దత్తత, బాల్యవివాహాలపై మహిళా శిశు సంక్షేమ శాఖ రూపొందించిన వాల్‌పోస్టర్లను శనివారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. దత్తత ప్రక్రియలో చట్టాలను పాటించకపోవడం, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ అంశాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్ పోటీల్లో ప్రతిభ


ఒలింపియాడ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్

శాంతిపురం: సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన గణిత విభాగం పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు స్వర్ణ పతకాలను సాధించారని పరమహంస యోగానంద విద్యాలయ ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ తెలిపారు. కూతేగౌనిపల్లి వద్ద ఉన్న పాఠశాల ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బహుమతులు పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ తొమ్మిదవ తరగతి చదువుతున్న కె.లిఖిత్‌కుమార్, 7వ తరగతి చదువుతున్న పి.లోక్‌సుందర్, ఎల్.పరిణితి, టి.వినిత్ ఉత్తమ ప్రతిభ చూపి స్వర్ణ పతకాలను సాధించారని చెప్పారు. పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. విద్యార్థులకు గణితంలో శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు దివాకర్, పుష్పకిరణ్‌ను సత్కరించారు.

చెరువులో వ్యర్థాలు

కుప్పంరూరల్: మల్లానూరు గ్రామంలో ఇండ్లు, దుకాణాల నుంచి వెలువడే వ్యర్థాలు మల్లానూరు చెరువులో పడేస్తున్నారు. దీంతో చెరువు మినీ డంపింగ్ యార్డును తలపిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నోటీస్ బోర్డు

నేడు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ఇఫ్తార్ విందు

పుంగనూరు: రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలకు ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా నిర్వహించే రీతిలో పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలచే అంజుమన్ షాదీ మహల్‌లో ఇఫ్తార్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని మసీదులకు చెందిన ముస్లింలు ఇఫ్తార్ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రక్తదాన శిబిరం

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ పి.శివ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'రక్తదానం చేయండి–ప్రాణాలను కాపాడండి' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రక్తదానంతో చాలా ప్రయోజనాలు ఉంటాయని, ప్రమాదంలో ఉన్న పలువురి ప్రాణాలు కాపాడేందుకు వీలుంటుందన్నారు. ఆరోగ్యకరంగా ఉన్న ప్రతిఒక్కరు రక్తదానం చేయొచ్చునని ఆయన పేర్కొన్నారు.

వయోజనులకు పరీక్ష

వి.కోట: నేడు వయోజన విద్య–ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండల వయోజనులకు ఫ్లాంట్ పరీక్ష (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ టెస్ట్)ను నిర్వహిస్తున్నట్లు మండల వెలుగు ఏపీఎం లావణ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 30 ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 9390504663 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

దిగువపల్లెలో వేలం పాటలు రేపు

చౌడేపల్లె: దిగువపల్లె సచివాలయం వద్ద సోమవారం వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, సర్పంచ్ సోని శనివారం తెలిపారు. చికెన్ షాపుల నిర్వహణ, ఐస్‌క్రీమ్‌లు విక్రయించుకునే హక్కులపై ఏడాది పాటు లీజుకిస్తూ నిర్వహించే వేలంలో పాల్గొనే వారు రూ.50 వేల ధరావత్తుతోపాటు రూ.లక్ష సాల్వెన్సీ కల్గి ఉండాలన్నారు. ఆసక్తిగల వ్యాపారులు వేలంలో పాల్గొనాలని వారు కోరారు.

భూముల కౌలుకు వేలం

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం దేవళంపేటలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చెందిన మెట్ట, మాగాణి భూములను కౌలుకు రైతులకు ఇవ్వడానికి వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి యువరాణి శనివారం తెలిపారు. ఈవేలం పాట ఈనెల 28న మధ్యాహ్నం 2గంటలకు దేవస్థానం ప్రాంగణంలో మూడేళ్లకు సంబంధించి వేలం నిర్వహిస్తామని తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.1000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.